క్లుప్తంగా

గృహ నిర్మాణాల పరిశీలన



అల్లూరు: మండలంలోని నార్తుఆములూరు పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలను జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ టీ వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. గృహ నిర్మాణాలకు స్టీలు, సిమెంట్, ఇసుక సకాలంలో అందుతున్నాయా..లేదా అని లబ్ధిదారును అడిగి తెలుసుకున్నారు.గృహాలను నిర్మించుకుంటున్న పొదుపు సభ్యులకు సీసీలతో చర్చించి త్వరితగతిన బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని మండలాధికారులకు సూచించారు. మండలంలోని లబ్ధిదారులు వంద రోజుల్లో నిర్మాణాలను పూర్తిచేసేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఈఈ మాధవ్‌రావు, డీఈ శ్రీనివాసరావ్, ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

గుండెపోటుతో బస్సు క్లీనర్ మృతి



రమేష్(ఫైల్)

అనుమసముద్రంపేట: గుండెపోటుతో బస్సు క్లీనర్ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు..ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం ప్రాంతానికి చెందిన గడ్డం రామయ్య, పెంచలమ్మ దంపతుల రెండో కుమారుడు గడ్డం రమేష్ (33) ఏఎస్‌పేట–హైదరాబాద్ నడుమ తిరిగే ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఏఎస్‌పేటకు బయలుదేరిన బస్సులో డ్రైవర్ పక్కన నిద్రించాడు. శనివారం ఉదయం ఏఎస్‌పేటకు చేరుకున్న తరువాత డ్రైవర్ నిద్ర లేపేందుకు ప్రయత్నించగా రమేష్ మృతి చెంది ఉన్నాడు. ఏఎస్‌పేట ఎస్సై సైదులుకు సమాచారం అందజేయగా మృతదేహాన్ని పరిశీలించుట పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా రమేష్‌కు భార్య అనూష, కుమారుడు ఉన్నారు. రమేష్ మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

ఆర్టీసీ లక్కీడిప్



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డిపోలో శనివారం లక్కీడిప్ నిర్వహించారు. ఆత్మకూరు–సోమశిల మార్గంలో ప్రయాణించిన ప్రసాద్, ఓబులేసును లక్కీడిప్‌లో ఎంపికవగా ఆత్మకూరుకు చెందిన వినాయక స్వీట్స్ అధినేత సుబ్బారావు సహకారంతో బహుమతులు ప్రదానం చేసినట్లు డీఎం కరీమున్నీసా తెలిపారు.

చీరల పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని ప్రియదర్శినినగర్‌లో పేద మహిళలకు శనివారం చీరలను పంపిణీ చేశారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఏడో వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, వైఎస్సార్‌సీపీ పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జి సయ్యద్ జమీర్‌బాషా వంద మందికిపైగా చీరలు అందజేశారు.

అన్నవరంలో తాగునీటికి కటకట

జలదంకి: మండలంలోని అన్నవరం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. మంచి నీటి పథకానికి సంబంధించిన టాన్స్‌ఫార్మర్ నెల రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. అప్పట్నుంచి విద్యుత్ అధికారులకు మొరపెట్టుకుంటున్నా దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. తాగునీటిని కొనుగోలు చేసి తాగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

కావలి: దగదర్తి మండలం పెద్దపుత్తేడు, ఉప్పలపాడు గ్రామాల నడుమ నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దగదర్తి పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,210 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

వరికుంటపాడు : తూర్పుబోయమడుగుల అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. టీకాల రిజిష్టర్లను తనిఖీ చేసి ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు.

80శాతం జీవాలకు నట్టల నివారణ మందు

వరికుంటపాడు : మండలంలోని 80శాతం జీవాలకు నట్టల నివారణ మందును పంపిణీ చేసినట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్ రాఘవేందర్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 75 వేలు జీవాలు ఉండగా, ఇప్పటి వరకు 60 వేల జీవాలకు అందజేసినట్లు వివరించారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది

క్షేత్రస్థాయి పర్యటనలు మమ
- నామమాత్రంగా అవగాహన సదస్సులు
- హాజరవని అనుబంధ శాఖల అధికారులు
- రైతుల నుంచి స్పందన కరువు



క్షేత్రస్థాయిలో కనిపించని అనుబంధ శాఖల అధికారులు

ఉదయగిరి: జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. పంటల సాగులో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు అందజేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం లక్ష్యం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. వ్యవసాయశాఖ సిబ్బంది రైతు సేవా కేంద్రాల్లో నామమాత్రంగా అవగాహన సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు అందజేయడం లేదు. ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమంపై పెదవి విరుస్తున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు, మెరుగైన సాగు పద్ధతులు, మేలైన రకాల వంగడాలు, ఉత్తమ సాగు పద్ధతులపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. తద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలి. శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించి రైతులకు ఉన్న సందేహాలను తీర్చాలి. ఇందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం 8.30 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించి సూచనలు చేయాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. కానీ క్షేత్రస్థాయిలో అనుకున్న రీతిలో కార్యక్రమం జరగడం లేదు. అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా ముందుగా ఎంపిక చేసిన రైతుల పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారు. వీటిని మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు.

కనిపించని అధికారులు

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయాధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులు కూడా తప్పక హాజరుకావాలి. వ్యవసాయ శాఖతో పాటు ఆత్మ, సెరీ కల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్ధక శాఖ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, ఏపీసీఎన్‌ఎఫ్, కోఆపరేటీవ్ ఫెడరేషన్, మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం, తదితర సుమారు పది శాఖల అధికారులు విధిగా హాజరుకావాలి. కానీ వాస్తవంగా రెండు, మూడు శాఖల కంటే ఎక్కువగా రావడం లేదు. వచ్చిన వారు కూడా ఫ్లెక్సీలతో ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.

రైతులకు అందని సూచనలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాలైన పైర్లు సాగులో ఉన్నాయి. వరి, మొక్కజొన్న, సజ్జ, మినుము, అలసంద, కంది, సన్‌ఫ్లవర్, తదితర పైర్లు సాగులో ఉన్నాయి. ఉద్యానపరంగా మామిడి, బత్తాయి, నిమ్మ, అరటి, తమలపాకు, బొప్పాయి, మిరప, వివిధ రకాల కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. పంటలను వివిధ రకాల చీడపీడలు పీడిస్తున్నాయి. అధిక వర్షాలతో పైర్లు దెబ్బతిన్నాయి. రబీ సీజన్ కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అండగా నిలవాలి. వారికి అవసరమైన సూచనలు ,సలహాలు ఇచ్చి భరోసా కల్పించాలి. కానీ ఆశించిన మేర రైతులకు అండగా నిలవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ప్రభుత్వం రూ.40కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా ఫలితాలు అంతంత మాత్రమే.

అధికారులందరూ హాజరుకావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి. ప్రతిరోజూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలి. కానీ కొన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదు. అందరూ బాధ్యతగా హాజరు కావాలి.

– చెన్నారెడ్డి, ఏడీఏ,ఉదయగిరి

బోర్డుల్లో తొలగించినా ప్రజల గుండెల్లో గౌతమ్‌రెడ్డి శాశ్వతం



తొలగించిన బోర్డును చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమశిల: నామకరణం బోర్డు నుంచి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించినంత మాత్రాన ఆయనపై ప్రజలకున్న అప్యాయతను ఎవరూ పోగొట్టలేరని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. అనంతసాగరంలోని పంచాయతీరాజ్ అతిథి గృహానికి ఉన్న గౌతమ్‌రెడ్డి నామకరణం బోర్డును ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చిన సమయంలో టీడీపీ నాయకులు తొలగించారు. గతంలో ఉన్న బోర్డును అలాగే అమర్చాలని, ఇటువంటి అంశాలపై రాజకీయం చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటూ ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్‌ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శోభ, దేవరాయపల్లి బిట్–2 సర్పంచ్ పోతుల నరసింహులు, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, బాలకొండారెడ్డి, పార్లపల్లి రవికుమార్‌రెడ్డి శనివారం అతిథి గృహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ రాజ్ ఏఈను వివరణ కోరగా తనకు తెలియకుండానే నేమ్‌బోర్డును తొలగించారని, విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డీఎస్పీ విచారణ

చేజర్ల: యనమదలలో ఇటీవల గిరిజన మహిళను టీడీపీ నాయకుడు మల్లినేని పెంచలయ్య లైంగిక వేధింపులకు గురిచేసిన కేసుపై ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ శనివారం విచారణ చేపట్టారు. గిరిజన మహిళ గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. మహిళ కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో కేసును విచారించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

కిచెన్ గార్డెన్లు పెంచాలి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను పెంచాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు సూచించారు. మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అపార్ ఐడీలను త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి పాఠశాలలోనూ ఖాళీ స్థలం ఉంటే కిచెన్ గార్డెన్లు పెంచాలని సూచించారు.

మచ్చలేని నాయకుడు గౌతమ్‌రెడ్డి



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మర్రిపాడులో..

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి మచ్చలేని రాజకీయ నాయకుడిగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గౌతమ్‌రెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని గౌతమ్‌రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి అన్నదానం చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్, కొండా వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు ప్రసన్నలక్ష్మి, లక్ష్మీకాంతమ్మ, షేక్ పర్వీన్, చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, కామాక్షయ్యనాయుడు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కే కిషోర్, బాలఅంకయ్య, వెంగళరెడ్డి, తోడేటి మణి, రవికుమార్‌రెడ్డి, పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, ఆంధ్రా వెంకటసుబ్బారెడ్డి, ముజీబ్, నందవరం ప్రసాద్, ఎస్ ప్రతాప్, రమేష్‌రెడ్డి, కేసీ వెంకటేశ్వర్లు, బాలచెన్నయ్య, జమ్రు పాల్గొన్నారు.

సంగం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగం బ్యారేజ్ వద్ద ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. యువజన విభాగ అధ్యక్షుడు ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, నాయకులు కరీముల్లా, కూరపాటి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగంలోని ఆర్‌ఎస్‌టీసీలో గౌతమ్‌రెడ్డి విగ్రహానికి మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీలు తుంగా ఇందూధర్‌రెడ్డి, ఎం దేవసహాయం, ఎంపీటీసీ ముడి మల్లికార్జునరెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు గుండాల బాలచంద్రారెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, పూనేటి ఫణికుమార్‌రెడ్డి, శంకరయ్య, ప్రకాష్, బాబు, మల్లి, సర్పంచ్‌లు మానికల చందన్‌కుమార్, మారుబోయిన సురేష్, వైస్ సర్పంచ్ నరేష్, కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్ పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్లలో సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, మురగళ్లలో బూత్ కమిటీ మేనేజర్ తోడేటి అశోక్ ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డికి నివాళులర్పించారు. సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్దం రెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు గంగినని రవీంద్రబాబు, చంద్రా నారాయణస్వామి, పొంగూరు సుధాకర్, సర్పంచ్ మాగంటి శ్రీనివాసులరెడ్డి, మౌలాలి, జయరామిరెడ్డి, వెంగయ్య, ఓబుల్‌రెడ్డి, విష్ణు, పఠాన్, గౌస్, గోవర్ధన్, పద్మారావు, ఓబులేసు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సంగం బ్యారేజ్‌పై..



సంగంలోని ప్రభుత్వ వైద్యశాలలో..

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కావలి: కావలి నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే 22 మంది పేదలకు వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.22లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

పట్టణంలోని 35వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నగదు విరాళం

ఆత్మకూరురూరల్: రావులకొల్లు ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోతురాజు స్వామి, మాతంగేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి రూ.50వేలు విరాళం అందజేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, రావులకొల్లు మాజీ సర్పంచ్ రామిరెడ్డి మోహన్ రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధి మల్లవరపు జయేంద్ర, వర ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.70 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

చేజర్ల: గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.70 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మాముదూరు గిరిజన కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.3.47 కోట్లతో సంగం–విరువూరు–కలువాయి రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, ఆత్మకూరు ఆర్డీఓ పావని, టీడీపీ నాయకులు గిరినాయుడు, రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దుత్తలూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అయూబ్‌అప్సర్ సూచించారు. మండలంలోని ఏరుకొల్లు ఎస్సీకాలనీలో జ్వరాలు ప్రబలడంతో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి దోమల లార్వా, జ్వరాల సర్వే నిర్వహించారు. మంచి నీటి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. హెల్త్‌విజిటర్ అరుణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీలు కిరణ్మయి, మానస, ఏఎన్ఎం సంజీవమ్మ, హెల్త్‌అసిస్టెంట్ అరాఫత్‌అలీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగుబడి



కావలి రూరల్‌లో పోసిన నారుమడి



రబీ సాగుకు సిద్ధం చేసిన పొలం

కావలి: కావలి నియోజకవర్గంలోని రైతులు రబీ సాగు పనులను ముమ్మరం చేశారు. వర్షాలు విస్తారంగా కురవడంతో పాటు సోమశిల జలాలను కూడా విడుదల చేయడంతో నారుమడులను సిద్ధం చేసుకుని నార్లు పోసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, దగదర్తి అల్లూరు మండలాల్లో లక్ష ఎకరాల్లో రబీ సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. స్వల్పకాలిక రకాలైన ఆర్ఎన్ఆర్ 15048, కేఎంఎం 1638, ఎంటీయూ 1010, బీపీటీ–5204, కేఎన్ఎం–1638, ఆర్ఎన్ఆర్–15048, తదితర రకాల విత్తనాలను కొనుగోలు చేసి నార్లు పోస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు నవంబర్‌లో కురిసే వర్షాలతో కావలి నియోజకవర్గంలో ఉన్న 95 చెరువుల్లో రెండు టీఎంసీల మేర నీరు లభ్యమవుతుందని రైతులు భావిస్తున్నారు. అలాగే కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు కనీసం ఐదు టీఎంసీలు వస్తాయని అంచనా వేస్తున్నారు. స్వల్ప కాలిక రకాలను సాగు చేయడం వల్ల సాగునీటికి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. ఓ వైపు నార్లు పోసుకుంటూ, మరోవైపు నారు అందుబాటులోకి రాగానే నాట్లు వేయడానికి పొలాలను దమ్ము చేసుకుంటున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

డీలర్లు విక్రయించే వరి విత్తనాల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నాం. డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మకాలు చేసినా, బిల్లులు లేకుండా విత్తనాలను రైతులకు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు బిల్లులను తీసుకుని భద్రంగా ఉంచుకోవాలి. బిల్లులు ఉంటే పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది. విత్తనాలను ముందుగా శుద్ధి చేసుకుని మొలకకట్టి నారుమడిలో చల్లుకోవాలి.

–ఏ లలిత, ఏఓ, కావలి

నేటి నుంచి మోగనున్న పెళ్లి బాజాలు



కావలిలో ముస్తాబైన ఓ కల్యాణ మండపం

కావలి: పెళ్లి బాజాలు ఆదివారం నుంచి మోగనున్నాయి. కార్తీక మాసం శనివారం నుంచి ఆరంభమైంది. ఈ మాసంలో 3, 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17 తేదీల్లో వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. అలాగే డిసెంబర్ 5, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 18, 26 తేదీల్లోనూ ముహూర్తాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. మూడు ముళ్ల బంధానికి శుభఘడియలు రావడంతో కొత్తజంటలు ఏకమయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు కల్యాణ మండపాలు, డెకరేషన్, క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్లు, మంగళవాయిద్యాలు, శుభలేఖలు, లైటింగ్, మ్యూజికల్‌నైట్స్, తదితరాలను ముందస్తుగా సిద్ధం చేసుకునే పనిలో తలమునకలవుతున్నారు. కావలి పట్టణంలో పదిహేను కల్యాణ మండపాలు ఉండగా, అన్ని మండపాలు ముందస్తుగా రిజర్వు అయ్యాయి. కల్యాణ మండపాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు హోటళ్లలో ఉన్న చిన్నచిన్న ఫంక్షన్ హాళ్లలో కూడా వివాహాలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. కాగా ఆరు నెలల క్రితంతో పోలిస్తే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు మండుతుండడంతో క్యాటరింగ్ బడ్జెట్ పెరిగిపోయింది. బంగారం ధరలు కూడా పెరగడంతో వివాహ బడ్జెట్ భారంగా మారిందని పెళ్లిళ్ల నిర్వాహకులు వాపోతున్నారు.

నూరుశాతం అక్షరాస్యతను సాధించాలి

కొండాపురం/ఉదయగిరి/అనుమసముద్రంపేట: నూరు శాతం అక్షరాస్యతను సాధించేందుకు వీఏఎలు కృషి చేయాలని కొండాపురం, ఏఎస్‌పేట ఎంపీడీఓలు ఆదినారాయణ, లక్ష్మీప్రసన్న, ఉదయగిరి ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. కొండాపురంలోని ఆదర్శ పాఠశాల, ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనం, ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వీఏఓలకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. కొండాపురం మండలంలో 505 మంది, ఉదయగిరి మండలంలో 331 మంది ఏఎస్‌పేట మండలంలో 380 మంది మహిళలను రాబోవు ఆరునెలల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కొండాపురం, ఉదయగిరి, ఏఎస్‌పేట వెలుగు ఏపీఎంలు కాంతారావు, ఖాజారంతుల్లా, సతీష్‌కుమార్, కొండాపురం, ఏఎస్‌పేట ఎంఈఓలు ఆనంద్‌రావు,కే రవికుమార్, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



ఆత్మకూరు: పట్టణంలోని బీసీ,ఎస్సీ బాలికల వసతిగృహాలను ఆర్డీఓ పావని శనివారం రాత్రి తనిఖీ చేశారు. వసతిగృహ పరిసరాలతో పాటు వంటగదిని పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యూటర్ల ద్వారా ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్లు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్లు మమత, స్పందన, సిబ్బంది ఉన్నారు.

మేలైన సాగు పద్ధతులపై శిక్షణ



అనుమసముద్రంపేట: రబీ సాగులో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజాకుమారి సూచించారు. మండలంలోని అనుమసముద్రంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు మేలైన సాగుపద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ప్రయోజనాలు, విత్తన శుద్ధి, రబీకి అనువైన వరి రకాలు, సమగ్ర ఎరువులు, నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించడంపై శిక్షణ ఇచ్చారు. ఏఓ రజని ,ఏఈఓ చిరంజీవి, వీఏఏలు జీ రమ, కే శ్రీహరి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ విద్యుత్ కనెక్షన్ తొలగింపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు వెంకట్రావుపల్లిలోని వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన విద్యుత్ బకాయిలు రూ.2లక్షలు ఉండడంతో విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నిర్వహణను స్థానికులకు అప్పగించారు. అయితే ప్లాంట్ నిర్వాహకుడు ఏడాదికిపైగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో వెంకట్రావుపల్లితో పాటు నరసాపురం, శాంతి నగర్‌కు చెందిన సుమారు వెయ్యి కుటుంబాలు ఐదు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.. ఈ విషయమై కౌన్సిలర్ శివకోటారెడ్డి మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, విద్యుత్ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే రైతు తన పొలంలోని బోరు నుంచి నీటిని సరఫరా చేసేందుకు అభ్యంతరం తెలిపాడని, గతంలో తాను వేయించిన పంచాయతీ బోరు నుంచి నీటిని సరఫరా చేసి తాగునీటిని అందిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌ను సంప్రదించగా విద్యుత్ బకాయిలను విడతల వారీగా చెల్లించేలా విద్యుత్ అధికారులను ఒప్పించామని, ఎవరైతే సక్రమంగా నిర్వహిస్తారో వారికే ప్లాంట్‌ను అప్పగిస్తామన్నారు.

కార్తీక శోభ



కావలి శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సంగంలోని సంగమేశ్వరాలయంలో ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న అర్చకులు

కావలి/సంగం/ఉదయగిరి: కార్తీక మాసం శనివారం ఆరంభం కావడంతో శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగించారు. కావలిలోని పాతూరు శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించారు. దుర్గాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగంలోని తిరుమనకొండ కాశీవిశ్వేశ్వరస్వామి, త్రివేణి సంగమం ఒడ్డునున్న సంగమేశ్వరస్వామి ఆలయం, దువ్వూరులోని కోటేశ్వరస్వామి, వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగించారు. అనంతరం దేవదేవేరులకు పల్లకిసేవ జరిపారు. ఉదయగిరి మండలంలోని గండిపాళెం, యగ్రబల్లి గడ్డ, లింగాలదొన, గుడినరవ, అప్పసముద్రం, జీ అయ్యవారిపల్లి, ఆర్లపడియ, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.